ప్రిస్క్రిప్షన్ ఉంటేనే యాంటిబయాటిక్స్

మొదటిపేజీ తరువాయి...

యాంటిబయాటిక్స్ అమ్మాలని తేల్చి చెప్పింది. ఎందుకోసం యాంటిబయాటిక్స్ వాడుతున్నారన్నదీ మందుల చీటీపై వైద్యులు పేర్కొనాలని స్పష్టంచేసింది.

పరిమితికి మించి వినియోగం

దేశంలో యాంటిబయాటిక్స్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. ఏ చిన్న రోగానికైనా యాంటిబయాటిక్స్ వాడటం సర్వసాధారణం అయిపోయింది. చిన్న పిల్లలకు కూడా ఇష్టారాజ్యంగా అందిస్తున్నారు. దీనివల్ల రోగకారక క్రిములు యాంటిబయాటిక్స్‌ను తట్టుకొనే శక్తిని పెంపొందించుకొంటున్న సందర్భాలు ఎదురవుతున్నాయి. అంటే.. రాబోయే కాలంలో యాంటిబయాటిక్స్ పని చేయకుండా పోతాయి. ఇప్పటికే చాలామందికి యాంటిబయాటిక్స్ పనిచేయటం లేదు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన డీజీహెచ్‌ఎస్.. అందరు ఫార్మాసిస్టులకు లేఖ రాసి, యాంటిబయాటిక్స్ వాడకంపై కఠిన నిబంధనలు జారీ చేసింది.

2100 నాటికి అమెరికాలో సగం ఘోస్ట్ టౌన్లు

జనాభా తగ్గడమే కారణమంటున్న నివేదిక

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): 2100నాటికి అమెరికాలోని దాదాపు సగం పట్టణాలు ఘోస్ట్ టౌన్లుగా మారబోతున్నాయి. ఈ పట్టణాల్లో జనాభా గణనీయంగా తగ్గడమే దీనికి కారణం. ఈ మేరకు నేచర్ జర్నల్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం వెల్లడించింది. అమెరికాలోని 30 వేల పట్టణాల్లో దాదాపు 15 వేల పట్టణాల్లో జనాభా క్రమంగా తగ్గనున్నట్టు ఈ అధ్యయనం పేర్కొంది. ఉపాధి అవకాశాల కోసం ప్రజలు పెద్ద నగరాలకు వలస వెళ్లడం ఒక కారణమైతే, నివాసానికి అనువైన ఉష్ణోగ్రతలు ఉన్న నగరాలకు అమెరికాలో ప్రాధాన్యం పెరుగుతుండటం మరో కారణమని వివరించింది. కాగా, అమెరికాలోని 60 శాతం పట్టణాల్లో జనాభా 5 వేల కంటే తక్కువగా ఉన్నదన్న విషయం తెలిసిందే.

లొంగిపోవడానికి మరింత గడువివ్వండి

సుప్రీంకు 'బిల్కిస్ బానో' దోషుల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జనవరి 18: కోర్టు ముందు లొంగిపోవడానికి తమకు మరికొన్ని రోజులు గడువు ఇవ్వాలని బిల్కిస్ బానో కేసు దోషులు సుప్రీం కోర్టును అభ్యర్థించారు. బిల్కిస్ బానో కేసులో 11 మంది ఖైదీలకు శిక్షాకాలం పూర్తి కాకుండానే గుజరాత్ ప్రభుత్వం ప్రసాదించిన క్షమాభిక్షను రద్దు చేస్తూ రెండు వారాల్లో వారిని తిరిగి జైలుకు పంపాలని సుప్రీం కోర్టు ఈ నెల 8న తీర్పు చెప్పింది. ఈ గడువు ఆదివారంతో ముగియనుండటంతో దోషుల్లో ఐదుగురు అనారోగ్యం, సర్జరీ, కుమారుని వివాహం, పంటల కోత వంటి కారణాలను చూపుతూ లొంగిపోవడానికి తమకు మరికొన్ని రోజుల గడువు మంజూరు చేయాలని కోరారు. ఈ విజ్ఞప్తి జస్టిస్‌లు బీవీ నాగరత్న, సంజయ్ కరోల్ బెంచ్ ముందుకు రాగా, ఆ దరఖాస్తులను చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ముందు ఉంచాలని వారు ఆదేశించారు.

ఈడీ విచారణకు కేజ్రీవాల్ మళ్లీ గైర్హాజరు

న్యూఢిల్లీ, జనవరి 18: ఢిల్లీ మద్యం విధానం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నాలుగోసారి కూడా ఈడీ ముందు విచారణకు హాజరుకాలేదు. ఈడీ సమన్లు చట్టవిరుద్ధమని ఆయన మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో తాను ప్రచారం చేయకుండా అడ్డుకునేందుకు రాజకీయ కుట్రలో భాగంగానే తనకు ఈడీ సమన్లు జారీచేస్తున్నదని ఆరోపించారు. ఢిల్లీ బడ్జెట్ సన్నాహాల్లో తాను బిజీగా ఉన్నానని ఈడీకి రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం కోసం ఆయన గోవా పర్యటనకు వెళ్లారు. మరోవైపు ఈ కేసులో కేజ్రీవాల్ సూత్రధారి అని, అందుకే ఆయన తనను అరెస్ట్ చేస్తారనే భయంతో వణికిపోతున్నారని బీజేపీ విమర్శించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మాట్లాడుతూ ఈడీ విచారణను తప్పించుకొనే బదులు వాటిని కేజ్రీవాల్ కోర్టులో ఎందుకు సవాల్ చేయడం లేదని ప్రశ్నించారు.

బోయింగ్‌లో సాంకేతిక లోపం.. చిక్కుకుపోయిన బ్లింకెన్

దావోస్, జనవరి 18: బోయింగ్ విమానం మళ్లీ మొరాయించింది. బోయింగ్ 737లో సాంకేతిక సమస్య తలెత్తడంతో బుధవారం అమెరికా రక్షణ మంత్రి ఆంథోని బ్లింకెన్ చాలా సేపు అందులో చిక్కుకుపోయారు. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొన్న అనంతరం జ్యూరిచ్ నుంచి వాషింగ్టన్‌కు తిరుగు ప్రయాణమైనప్పుడు ఈ ఘటన జరిగింది. ఆ తర్వాత మరో విమానంలో బ్లింకెన్ వాషింగ్టన్ వెళ్లిపోయారు. ఇటీవల బోయింగ్ 737 మాక్స్ విమానాల్లో తరచూ సమస్యలు తలెత్తడం గమనార్హం. కొద్ది రోజుల కిందట గగనతలంలో విమానం డోర్ ఊడిపోయిన ఘటన భయాందోళనలు రేపిన విషయం తెలిసిందే.

గణతంత్ర వేడుకలకు ప్రత్యేక అతిథులుగా రైతు దంపతులు

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరంలో ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవాలకు ప్రత్యేక అతిథులుగా 1,500 మంది రైతు దంపతులను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవాలకు రైతు దంపతులను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించడం ఇదే తొలిసారి అని చెప్పారు. దేశంలోని అన్ని ప్రాంతాల వారిని ఎంపిక చేసి ఆహ్వానించామన్నారు. వ్యవసాయోత్పత్తుల సంఘాల ప్రతినిధులు, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, చిన్న తరహా నీటిపారుదల పథకాల లబ్ధిదారులు వీరిలో ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా వీరికి విందు ఇస్తారని చెప్పారు. గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాలకు దాదాపు 500 మంది రైతులను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించారు.

గోధుమలకు కొరత?

- ప్రభుత్వ గోదాముల్లో 163 లక్షల టన్నులకు పరిమితం
- ఏడేండ్లలో ఎన్నడూచూడని స్థాయికి క్షీణించిన నిల్వలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): దేశంలో గోధుమల నిల్వలు భారీగా పడిపోయాయి. జనవరి 1 నాటికి దేశవ్యాప్తంగా కేంద్రప్రభుత్వ గోదాముల్లో గోధుమల స్టాక్ 163.53 లక్షల టన్నులుగా ఉన్నట్టు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), స్టేట్ ఫుడ్ ఏజెన్సీల గణాంకాలను బట్టి తెలుస్తున్నది. 2017 తర్వాత ఈ స్థాయిలో నిల్వలు పడిపోవడం ఇదే తొలిసారి. గోధుమ నిల్వల కనీస బఫర్ స్థాయిని 138 లక్షల టన్నులుగా నిర్ణయించారు. ప్రస్తుతం బఫర్ స్థాయి కంటే గోధుమల నిల్వలు ఎక్కువగా ఉన్నాయి. అయితే, ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయెల్-హమాస్, ఇరాన్-పాక్ దేశాల మధ్య కొనసాగుతున్న సంక్షోభ పరిస్థితులు పలు దేశాల ఎగుమతులు, దిగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. దీంతో పాటు ద్రవ్యోల్బణ భయాలు ఉండనే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో దేశంలో గోధుమలకు కొరత ఏర్పడితే, అది ఆహార సంక్షోభానికి దారితీయొచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వెంటనే గోధుమల నిల్వలను పెంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు.

సంవత్సరం	గోధుమల నిల్వలు (లక్షల టన్నుల్లో)
2017	137.47
2018	195.62
2019	271.21
2020	327.96
2021	342.90
2022	330.12
2023	171.70
2024(జనవరి 1)	163.53

ఆధారం: ఎఫ్‌సీఐ, స్టేట్ ఏజెన్సీలు

గూగుల్‌లో మరిన్ని కోతలు

నిర్ధారించిన సీఈవో సుందర్ పిచాయ్

న్యూఢిల్లీ, జనవరి 18: టెక్ దిగ్గజం గూగుల్ ఉద్యోగులకు మరో షాకిచ్చింది. గత కొన్ని నెలలుగా వేలాది మంది ఉద్యోగులను తొలగిస్తూ వస్తున్న ఈ సంస్థ 2024లో సైతం ఈ తొలగింపులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ప్రకటనలు, అమ్మకాల విభాగం నుంచి వెయ్యి మందిని తొలగిస్తున్నట్టు గూగుల్ ఈ వారమే ప్రకటించింది. అయితే ఈ తొలగింపులు ఇంకా ఆగిపోలేదని, ఈ ఏడాది మరింత అధికంగా ఉంటాయని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ నిర్ధారించారు. ఈ సందర్భంగా 'లేఆఫ్' అన్న పదాన్ని వాడటాన్ని ఆయన వ్యతిరేకించారు. ఈ ఏడాది సంస్థలో చేపట్టే భారీ మార్పుల గురించి ఇంటర్నెట్‌లో లీకైన ఆయన అంతర్గత మెమోలో వివరించారు. వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా కంపెనీ సిబ్బందిని క్రమబద్ధీకరించాల్సిన అవసరం గురించి ఆయన మాట్లాడారు. అయితే లేఆఫ్ అనే పదాన్ని ఉపయోగించడాన్ని ఆయన వ్యతిరేకించారు. దానికి బదులుగా సంస్థకు మీరు అవసరం లేదని చెప్పడం ఒక ఫ్యాన్సీ మార్గమని ఆయన పేర్కొన్నారు. కాగా, యూట్యూబ్‌లో సుమారు 100 మంది ఉద్యోగులపై గూగుల్ తాజాగా వేటు వేసింది.

జన్యుమార్పిడి పంటలపై నిషేధం తగదు

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: జన్యుపరంగా మార్పులు చేసిన (జీఎం) పంటలు ఆహార భద్రతకు భరోసాని స్తాయని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు చెప్పింది. జీఎం నూనె గింజల నుంచి తీసిన వంట నూనెలను దేశీయ వినియోగం కోసం పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపింది. ఇవి ప్రతికూల ప్రభావం చూపుతాయనే నిరాధారమైన భయాలు పరిశ్రమ, రైతులు, వినియోగదారులను దెబ్బతీస్తాయని చెప్పింది. కోరుకున్న లక్షణాలతో కూడిన నూతన వంగడాలను సృష్టించగలిగే కార్యక్రమాలను పటిష్టపరచవలసిన అవసరం చాలా ఉందని చెప్పింది. విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ, మన దేశ వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించేందుకు నూతన జన్యుపరమైన సాంకేతిక పరిజ్ఞానాలు అవసరమని తెలిపింది.

కేంద్రమంత్రి కిడ్నాప్‌కు యత్నం!

- దుండగుడి అరెస్ట్

లక్నో, జనవరి 18: కేంద్ర సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతిని కిడ్నాప్ చేయడానికి ఓ దుండగుడు ప్రయత్నించాడు. మంత్రి డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని ప్రశ్నిస్తున్నారు. డ్రైవర్ నిరంజన్ కథనం ప్రకారం మంగళవారం ఢిల్లీ నుంచి లక్నో వస్తున్న మంత్రిని ఎయిర్‌పోర్టు నుంచి తీసుకు రావడానికి నిరంజన్ కారులో బయలుదేరాడు. ఒక చోట టీ తాగడానికి కారు ఆపగా ఓ యువకుడు కారులోని అంగరక్షకుడిని తోసేసి కారుతో పారిపోవడానికి ప్రయత్నించాడు. అయితే మిగతా భద్రతా సిబ్బంది అడ్డగించి అతడిని పోలీసులకు అప్పగించారు.

మణిపూర్‌లో మళ్లీ కాల్పులు

నలుగురు మృతి!

ఇంఫాల్:మణిపూర్‌లో హింసాత్మక ఘటనలకు అడ్డుకట్ట పడటం లేదు. గురువారం బిష్ణుపూర్ జిల్లాలో జరిగిన తుపాకీ కాల్పుల ఘటనలో మరో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలో జాతుల మధ్య ఘర్షణలు, హింస కొనసాగుతున్నాయని పోలీస్ అధికారులు మీడియాకు తెలిపారు. మృతుల్లో తండ్రీకొడుకులున్నారని, ఘటనపై విచారణ జరుపుతున్నామని అధికారులు చెప్పారు. 'ఐదుగురు లేదా ఆరుగురితో కూడిన సాయుధ దుండగులు వ్యవసాయ పనులు జరుగుతున్న చోటకు వచ్చి హఠాత్తుగా కాల్పులకు దిగారు' అని తెలిపారు.

రాష్ట్రాలకిచ్చే నిధుల్లో కోత పెట్టండి

మొదటిపేజీ తరువాయి...

గుర్తుచేసింది. ఇదే అంశంపై సుబ్రహ్మణ్యమ్, కేంద్ర ఆర్థిక శాఖ, ప్రధాన మంత్రి కార్యాలయాన్ని తమ బృందం సంప్రదించాలని ప్రయత్నించినప్పటికీ, అటునుంచి ఎలాంటి స్పందన రాలేదని అల్‌జజీరా పేర్కొంది. సదస్సులో సుబ్రహ్మణ్యమ్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్ కూడా యూట్యూబ్ నుంచి మాయమైనట్టు 'ది వైర్' పత్రిక వెల్లడించింది.

రోహతక్‌లో నియామకాల కార్యక్రమానికి హాజరైన ఉద్యోగార్థులు

యుద్ధం కన్నా నిరుద్యోగమే భయానకం!

యుద్ధం జరుగుతున్నా ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఇండియన్ వర్కర్స్

న్యూఢిల్లీ: భారతీయులు యుద్ధం కన్నా నిరుద్యోగ భూతానికి భయపడుతున్నారు. 140 కోట్ల జనాభాతో ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల భారత్‌లో.. పట్టణాల్లో 6.6 శాతం నిరుద్యోగులు ఉన్నారని ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయి. 29 ఏళ్ల కన్నా తక్కువ వయసు గలవారిలో 17 శాతం మంది నిరుద్యోగులని వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగం కోసం వీరు యుద్ధక్షేత్రమైన ఇజ్రాయెల్ వెళ్లేందుకు కూడా వెనకాడటం లేదు. ఇజ్రాయెల్‌కు కార్మికులను పంపేందుకు హర్యానాలోని రోహతక్‌లో ఈ నెల 17న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నియామకాల కార్యక్రమానికి వేల మంది హాజరయ్యారు. వీరిలో తాపీ మేస్త్రీలు, కూలీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు వంటివారు ఉన్నారు. ఇక్కడ ఒక సంవత్సరంలో సంపాదించేదానికి ఐదు రెట్లు ఇజ్రాయెల్‌లో సంపాదించుకోవచ్చునని వీరిలో కొందరు మీడియాకు చెప్పారు.

నకిలీ ఎస్సెస్సీ బోర్డు వెబ్‌సైట్లు

- సైబర్‌క్రైమ్‌కు బోర్డు ఫిర్యాదు
- తక్షణమే తొలగించాలని వినతి
- అన్ని కోణాల్లో సైబర్‌క్రైమ్ దర్యాప్తు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ): ఎస్సెస్సీ బోర్డు పేరుతో నకిలీ వెబ్‌సైట్లు నెట్టింట ప్రత్యక్షమయ్యాయి. వీటితో అసలైన బోర్డు వెబ్‌సైట్‌కు ఇబ్బందులున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని బోర్డు అధికారులు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మార్చి, ఏప్రిల్‌లో టెన్త్ పరీక్షలకుఎస్సెస్సీ బోర్డు సన్నాహాలు చేస్తున్నది. విద్యార్థుల డాటాను www.bse.telangana.gov.in ద్వారా సేకరిస్తున్నది. ఈ వెబ్‌సైట్‌ను జిల్లా విద్యాధికారులు, సెకండరీ స్కూల్స్ హెడ్స్ ఆపరేట్ చేసే వీలు ఉన్నది. బోర్డుకు సంబంధించిన కంప్యూటర్ వర్క్ సికింద్రాబాద్‌లోని మ్యాగ్నటిక్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్నది. ఈ నేపథ్యంలో బోర్డు అసలైన వెబ్‌సైట్లను పోలినట్టు రెండు (bsetelangana.co.in, bsetelanganagov.in) నకిలీ వెబ్‌సైట్లను గుర్తించిన సంస్థ ఈ విషయాన్ని బోర్డు అధికారులకు తెలిపింది. నకిలీ వెబ్‌సైట్లను తొలగించి, నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రావు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నకిలీ వెబ్‌సైట్ల సృష్టి వెనుక ఇంటర్మీడియట్, ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల పాత్ర ఉన్నదా? అనే అనుమానాలు సైబర్‌క్రైమ్ పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. అన్ని కోణాల్లో సైబర్‌క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్ సర్వీస్ సూపర్‌హిట్

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఫేక్ సర్టిఫికెట్లను అడ్డుకట్ట వేసేందుకు అమలుచేస్తున్న స్టూడెంట్ అకడమిక్ వెరిఫికేషన్ సర్వీస్ (ఎస్‌ఏవీఎస్) పోర్టల్ విజయవంతమైంది. ఒకేఒక్క క్లిక్‌తో సర్టిఫికెట్లు అసలువో.. నకిలీవో దీని ద్వారా తెలిసిపోతున్నది. కార్పొరేట్ కంపెనీలు, జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, హెచ్‌ఆర్ మేనేజర్లు రాష్ట్రంలోని ఏ అభ్యర్థి సర్టిఫికెట్‌ను పరిశీలించాలన్నా ఎస్‌ఏవీఎస్ పోర్టల్‌నే ఆశ్రయిస్తున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా చెలరేగుతున్న ఫేక్ సర్టిఫికెట్ల ముఠాలకు అడ్డకట్ట వేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఈ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. నకిలీ విత్తనాలను అరికట్టడంలో సక్సెస్ సాధించినట్టుగానే.. నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట వేయడానికి కేసీఆర్ ఆలోచనల మేరకు 2022 నవంబర్‌లో ఎస్‌ఏవీఎస్ పోర్టల్‌ను ప్రారంభించారు. 2001 నుంచి 2023 వరకు రాష్ట్రంలోని 15 వర్సిటీల్లోని 25 లక్షల మంది విద్యార్థుల సమాచారాన్ని ఈ పోర్టల్‌లో నిక్షిప్తంచేశారు.

వర్సిటీల వారీగా వివరాలిలా...

వర్సిటీ	పరిశీలించిన సర్టిఫికెట్లు
జేఎన్టీయూ	2,88,645
ఉస్మానియా	64,927
కాకతీయ	13,109
మహాత్మాగాంధీ	1,322
అగ్రికల్చర్ వర్సిటీ	33
తెలుగు వర్సిటీ	79
పాలమూరు	574
వెటర్నరీ వర్సిటీ	04
ఆర్జీయూకేటీ	971
జేఎన్ఏఎఫ్ఏయూ	141
హార్టికల్చర్ వర్సిటీ	14
కాళోజీ హెల్త్ వర్సిటీ	384

29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్రంలోని సర్కారు బడుల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)లఎన్నికలు 29న నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో 26వేలకు పైగా బడుల్లో కొత్త ఎస్‌ఎంసీలు కొలువుదీరనున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ గురువారం ఈ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. రాష్ట్రంలో ఎస్‌ఎంసీలకు చివరిసారిగా 2019లో డిసెంబర్‌లో ఎన్నికలు జరగ్గా, వీటి గడువు 2021 డిసెంబర్‌తో ముగిసింది. కరోనా తర్వాత పరిస్థితుల కారణంగా వీటి కాల పరిమితిని పలుసార్లు పొడిగిస్తూ వచ్చారు.

షెడ్యూల్ - మార్గదర్శకాలు

- 20న ఎస్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ వెల్లడిస్తారు. అదేరోజు తల్లిదండ్రుల జాబితాను బడుల్లో ప్రదర్శిస్తారు.
- 22న జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. 24న తుది జాబితాను ప్రకటిస్తారు.
- 29న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎస్‌ఎంసీ సభ్యుల ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1:30కు ఎస్‌ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్‌చైర్మన్‌ను ఎన్నుకొంటారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఎస్‌ఎంసీ తొలి సమావేశం జరుగనున్నది.
- చైర్మన్, వైస్‌చైర్మన్ సహా ఒక్కో తరగతి నుంచి ముగ్గురు ఎన్నికైన తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు మరో ఐదుగురు ఎక్స్‌ఆఫీషియో సభ్యులుగా, ఇద్దరు కో ఆప్టెడ్ సభ్యులుంటారు. హెచ్‌ఎం మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.
- 1 -8 తరగతుల్లోని విద్యార్థుల తల్లిదండ్రులే సభ్యులుగా ఉంటారు. 9, 10 తరగతుల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ కమిటీల్లో అవకాశం కల్పించరు.
- 50శాతం తల్లిదండ్రులు ఎన్నికలు నిర్వహించే సమావేశానికి హాజరు కావాలి. చెతులేత్తే పద్ధతి/ వాయిస్ వోట్ ద్వారా ఎన్నికలను నిర్వహిస్తారు. హెచ్‌ఎంలు ఈ ఎన్నికలను నిర్వహిస్తారు.

త్వరలో డిజిటల్ యూనివర్సిటీలు

- లోక్‌సభ ఎన్నికల తర్వాత అందుబాటులోకి
- ఇకపై గ్రామీణ ప్రాంతాల్లోనూ డిజిటల్ విద్య
- సీఈసీ డైరెక్టర్ ప్రొఫెసర్ జగత్ భూషణ్ నడ్డా వెల్లడి

ప్రొఫెసర్ జేబీ నడ్డా

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ): పట్టణ ప్రాంతాలకే పరిమితమైన డిజిటల్ విద్యా బోధన ఇకపై గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించనుంది. ఇందుకోసం జాతీయ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయని కన్సార్షియం ఫర్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ (సీఈసీ) డైరెక్టర్ ప్రొఫెసర్ జగత్‌భూషణ్ నడ్డా తెలిపారు. త్వరలోనే జాతీయ స్థాయిలో డిజిటల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రయత్నాలు జోరందుకున్నాయని చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల తర్వాత డిజిటల్ యూనివర్సిటీ అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. వీలైతే వచ్చే విద్యా సంవత్సరం నుంచే డిజిటల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడానికి కేంద్రం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసిందని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఎడ్యుకేషన్ మీడియా రిసెర్చ్ సెంటర్ (ఈఎంఆర్‌సీ) ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరుగనున్న ఈ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జాతీయ స్థాయిలో విద్యార్థుల నమోదు నిష్పత్తి 27.1 శాతం వరకు ఉన్నదని, దానిని 2035 నాటికి 50 శాతానికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి కేంద్రం చర్యలు చేపట్టిందని తెలిపారు. అందులో భాగంగా ప్రస్తుతం తరగతి గదిలో జరుగుతున్న బోధనా విధానానికి ప్రత్యామ్నాయంగా డిజిటల్ విద్యా విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు (మూక్స్), స్వయమ్ వంటి వేదికల ద్వారా డిజిటల్ విద్యను అందిస్తున్నామని చెప్పారు.

మూక్స్ విధానంలో కోర్సులు

డిజిటల్ యూనివర్సిటీ ఏర్పాటైతే దాని ద్వారా నేరుగా తరగతులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే మూక్స్ విధానంలో కోర్సులు, డిజిటల్ పాఠాలు అందుబాటులోకి తీసుకస్తామని చెప్పారు. ఇప్పటికే యూజీసీ నిబంధనల ప్రకారం అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ వంటి కోర్సులకు సంబంధించిన పాఠాలను డిజిటలైజేషన్ చేశామని అన్నారు. ఈ పాఠాలు ప్రస్తుతం ఇంగ్లిష్ మీడియంలో అందుబాటులో ఉన్నాయని, వాటిని దేశవ్యాప్తంగా మొత్తం 13 ప్రాంతీయ భాషల్లోకి అనువాదం చేసే పనులు ఈఎంఆర్‌సీల ద్వారా ఊపందుకున్నాయని తెలిపారు. డిజిటల్ యూనివర్సిటీల ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చే కోర్సులకు యూజీసీ గుర్తింపు ఉంటుందని అన్నారు. తొలుత కొన్ని డిప్లొమా కోర్సులతోపాటు ఆర్ట్స్‌కు సంబంధించి కోర్సులను ప్రవేశపెడతామని తెలిపారు. ఇంజినీరింగ్ వంటి కోర్సుల్లో ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూషన్ల ద్వారా ఆన్‌లైన్ విద్యా బోధన జరుగుతుందని చెప్పారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా ఐపీఎస్?

- ప్రభుత్వ పరిశీలనలో ఇద్దరి పేర్లు
- ముగిసిన దరఖాస్తుల గడువు

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్‌గా పోలీసు ఉన్నతాధికారిని నియమించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. వారిలో ప్రస్తుతం సమర్థంగా విధులు నిర్వర్తిస్తున్న ఒక ఐపీఎస్ అధికారితోపాటు రాష్ట్రానికి విశేష సేవలందించిన రిటైర్డ్ ఐపీఎస్ ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం విధుల్లో ఉన్న ఆ అధికారి చైర్మన్ పదవికి సుముఖంగా లేరని తెలిసింది. చైర్మన్ పోస్టుకు మాజీ పోలీసు ఉన్నతాధికారి ఒకరు సుముఖంగానే ఉన్నప్పటికీ, ప్రభుత్వం నిర్ణయించిన వయోపరిమితి ప్రకారం ఆయన ఒక ఏడాది మాత్రమే ఆ పదవిలో కొనసాగే అవకాశం ఉంటుంది. దీంతో ప్రభుత్వ పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలిసింది. టీఎస్‌పీఎస్సీ సభ్యుల నియామకానికి ప్రభుత్వం ఈ నెల 12 నుంచి 18 వరకు దరఖాస్తులను స్వీకరించగా భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్టు తెలిసింది. దరఖాస్తులను స్క్రూటినీ చేసేందుకు కమిటీని నియమించి, సభ్యుల అర్హతలను తేల్చనున్నట్టు సమాచారం. వడపోత ప్రక్రియ ముగిసిన అనంతరం సభ్యులను, చైర్మన్‌ను ప్రభుత్వం నిర్ణయించనున్నది.

అన్నారం బరాజ్ సీపేజ్ పనుల గురించి తెలుసుకుంటున్న అడిషనల్ డీజీ రాజీవ్‌రతన్

సరస్వతీ బరాజ్‌లో స్వల్ప లోపాలే

- మరమ్మతులు చేపడితే సరిపోతుంది
- బరాజ్ ఈఈ యాదగిరి వెల్లడి
- సీపేజీలకు ట్రీట్‌మెంట్, గ్రౌటింగ్ పనులు
- పరిశీలించిన విజిలెన్స్ అడిషనల్ డీజీ

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 18 (నమస్తే తెలంగాణ)/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్నారం (సరస్వతీ) బరాజ్‌లో ప్రమాదకర పరిస్థితులు ఏమీ లేదని ఆ బరాజ్ ఈఈ యాదగిరి తెలిపారు. చిన్నచిన్న లోపాలను మరమ్మతులతో సరిదిద్దవచ్చని సూచించారు. బరాజ్ సీపేజ్‌ల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ ఐదు రోజుల క్రితం ప్రారంభించగా రెండు సీపేజ్‌లలో పాలీ యూరిథ్రిన్ కెమికల్‌తో గ్రౌటింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నది. పనులను చేపట్టిన ఆఫ్కాన్స్ నిపుణులు కొంత విరామం ఇచ్చి పరిశీలనలో ఉంచారు. గురువారం విజిలెన్స్ అడిషనల్ డీజీ రాజీవ్ రతన్ అన్నారం, మేడిగడ్డ బరాజ్‌లను, కన్నెపల్లి పంప్‌హౌస్‌లో 3వ ఫ్లోర్ నుంచి మోటర్లను పరిశీలించారు. సరస్వతీ బరాజ్‌లో 38, 28వ ఔట్‌లెట్‌లో అక్టోబర్‌లో భారీ వర్షాలతో చిన్న చిన్న సీపేజ్‌లు ఏర్పడిన విషయాన్ని సరస్వతీ బరాజ్ ఈఈ యాదగిరి అడిషనల్ డీజీ రాజీవ్‌రతన్‌కు వివరించారు. ప్రారంభంలోనే అప్రమత్తమై స్టోన్, మెటల్, ఇసుకతో తాత్కాలిక ట్రీట్‌మెం ట్ చేసి లీకేజీని అరికట్టామని, సీపేజ్ నుంచి ఇసుక బయటికి పోకుండా అడ్డుకున్నట్టు ఈఈ యాదగిరి ఏడీజీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ పనులను చూసి ఏదో జరుగుతుందని పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో అంతా అయోమయానికి గురయ్యారని పేర్కొన్నారు. ఇటీవల మంత్రుల బృందం సైతం అన్నారం బరాజ్‌ను పరిశీలించి రెండు సీపేజ్‌లతో ప్రమాదమేమీ లేదని తేల్చిందని, నిర్మాణ సంస్థచే గ్రౌటింగ్ చేయించాలని చెప్పినట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట మేడిగడ్డ ఈఈ తిరుపతి రావు, అధికారులు ఉన్నారు.

తొలగించారు.. మళ్లీ నియమించారు

- ఉన్నత విద్యామండలి చైర్మన్, వైస్‌చైర్మన్ల కొనసాగింపు
- విధులు నిర్వర్తించనున్న లింబాద్రి, వెంకటరమణ

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ఆర్ లింబాద్రిని, వైస్ చైర్మన్‌గా వీ వెంకటరమణను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి గురువారం జీవో జారీచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక 54 మంది కార్పొరేషన్ చైర్మన్లను తొలగిస్తూ గత ఏడాది డిసెంబర్ 10న ప్రభుత్వం జీవో జారీచేసింది. ఈ జీవోలో వీరి పేర్లు కూడా ఉన్నాయి. అయితే, మరో వైస్ చైర్మన్ ఎస్కే మహమూద్‌ను తొలగించకపోవడంతో అప్పటినుంచి అదే పదవిలోనే కొనసాగుతున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌ను తొలగించడంతో వీరి స్థానంలో కొత్తవారిని నియమిస్తారని అంతా భావించారు. వీరినే తిరిగి కొనసాగించే అవకాశాలున్నట్టుగా ప్రభుత్వం సంకేతాలిచ్చింది. ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షకు వీరిని ఆహ్వానించారు. ఇంజినీరింగ్, బీఈడీ, లా, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సుల్లో ప్రవేశ పరీక్షల(సెట్స్)కు షెడ్యూళ్లను విడుదల చేయాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలోనే వీరిని తిరిగి కొనసాగిస్తూ నిర్ణయం తీసుకొన్నది.

విద్యా - ఉద్యోగ సమాచారం

క్యాట్ అడ్మిషన్లకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లలో ప్రవేశాలపై అడ్మిషన్స్ కమిటీ కీలక నిర్ణయం తీసుకొన్నది. ఇక నుంచి పర్సనల్ ఇంటర్వ్యూలను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు కమిటీ చైర్మన్ అబ్రదీప్ మైతీ తెలిపారు. ఈ ర్యాంకు ద్వారా ఎంబీఏ, మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ఏడాది జనరల్ క్యాటగిరీ కటాఫ్ 94, ఈడబ్ల్యూఎస్ 77, ఓబీసీ నాన్ క్రీమీలేయర్ 77, ఎస్సీ 60, ఎస్టీ 40 మార్కులుగా నిర్ణయించారు.

గురుకులాల్లో ప్రవేశాల దరఖాస్తుకు రేపే ఆఖరు

హైదరాబాద్, జనవరి18 (నమస్తే తెలంగాణ): వచ్చే విద్యాసంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5తరగతిలో ప్రవేశాల దరఖాస్తు గడువు ఈ నెల 20న ముగియనున్నట్టు గురుకులాల కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు ర్హులని పేర్కొన్నారు. ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి, మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 1800 425 45678 లేదా www.tgcet.cgg.gov.in, http://www.tgcet.cgg.gov.inలో సంప్రదించాలని తెలిపారు.

20న అగ్రికల్చర్ బీఎస్సీ ఆనర్స్ కౌన్సెలింగ్

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): జగిత్యాల గురుకుల కాలేజీలో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ కోర్సులో సీట్ల భర్తీకి మూడోదశ కౌన్సెలింగ్‌ను ఈ నెల 20న నిర్వహించనున్నట్టు రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ ప్రకటించింది. అర్హులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్ ప్రధాన కార్యాలయానికి రావాలని సూచించింది.

వాయు అగ్నివీర్‌ల భర్తీకి దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): అగ్నిపథ్ స్కీంలో భాగంగా వాయు అగ్నివీర్‌ల నియామకానికి ఈ నెల 17 నుంచి ఫిబ్రవరి 6 వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డిఫెన్స్ విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. 2004 జనవరి 2 నుంచి 2007 జూలై 2 మధ్యకాలంలో జన్మించిన యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. టాటూలున్నవారు అనర్హులని పేర్కొన్నది.

హైదరాబాద్ కేంద్రంగా స్పేస్ రిసెర్చ్ సెంటర్!

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 18(నమస్తే తెలంగాణ): రానున్న రోజుల్లో హైదరాబాద్ ఖగోళ పరిశోధనలకు కేంద్రంగా మారనున్నది. స్పేస్ టెక్నాలజీని అభివృద్ధి చేసేందుకు స్పేస్ రిసెర్చ్ సెంటర్ ఇక్కడికి రానున్నది. హైదరాబాద్‌లోని జేఎన్టీయూ, ఇస్రోతో కలిసి స్పేస్ రిసెర్చ్ సెంటర్ స్థాపనకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెకాల్నజీ సన్నాహాలు చేస్తున్నది. అనుమతులకు ఆమోదం తెలిపినట్టు సమాచారం.

23న ఆర్టీసీ నర్సింగ్ కాలేజీ పోస్టులకు ఇంటర్వ్యూలు

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): తార్నాకలోని ఆర్టీసీ నర్సింగ్ కళాశాలలో పోస్టుల భర్తీకి ఈ నెల 23న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అసోసియేట్ ప్రొఫెసర్, ట్యూటర్‌తోపాటు ఇతర పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయాలని సంస్థ నిర్ణయించిందని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం tsrtc.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సూచించారు.